## క్లుప్తంగా

### తేజశ్రీకి కలెక్టర్ అభినందన



కాకినాడలో తేజశ్రీని అభినందిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

పెదపూడి: సంపర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పీవీవీఎస్ఎల్ తేజశ్రీ ఇటీవల విడుదలైన 2024–2025 పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 594 మార్కులతో కాకినాడ జిల్లాలోనే ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఆ విద్యార్థిని కాకినాడ కలెక్టర్ షణ్మోహన్ గురువారం అభినందించి సత్కరించారు. పాఠశాల హెచ్ఎం త్రిమూర్తులు, గ్రామ పెద్దలు, సంపర ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జోన్–2 నాగమణి, డీఈఓ పి.రమేష్ సంపర పాఠశాల్లో టాపర్స్ అయిన తేజశ్రీతో పాటు 572 మార్కులు సాధించిన బత్తిన దీపిక, 556 మార్కులు సాధించిన బి.వీరమోహన్‌లక్ష్మిని సత్కరించారు. పాఠశాల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న సంపర ఎంప్లాయిస్ అసోసియేషన్ సేవలను ఆమె కొనియాడారు.

### కలెక్టర్‌కు బ్లాక్ రైస్ బహూకరించిన రైతు



బ్లాక్ రైస్ ప్యాకెట్‌ను కలెక్టర్‌కు అందజేస్తున్న రైతు

రాజానగరం: ఐరన్, జింక్ వంటి పోషకాలతో నిండి, ఆరోగ్యానికి తోడ్పడే బ్లాక్ రైస్ (బీపీటీ 2841) బియ్యాన్ని రంగంపేటకు చెందిన అభ్యుదయ రైతు పోతుల పద్మారావు పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సి.నాగమణికి కానుకగా అందజేశారు. ఈ విషయాన్ని దివాన్ చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు తెలిపారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అమలు చేసే పరిశోధన, విస్తరణ కార్యాచరణపై మార్టేరులో గురువారం శాస్త్రవేత్తలు, రైతులతో సమావేశం నిర్వహించారని వెంకటనరసింహారావు తెలిపారు.

### ఉపాధి హామీ పనుల్లో నిబంధనలు పాటించాలి



పుట్టకొండలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో నిబంధనలు పాటించాలని, నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి హెచ్చరించారు. ఆయన పుట్టకొండ, చింతపల్లి, కుమారప్రియం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మస్తర్లు పరిశీలించారు. బినామీ మస్తర్లు వేయరాదన్నారు. పని చేసే ప్రదేశం వద్ద కూలీలకు తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడిగా వాకచర్ల



వాకచర్ల విష్ణుమూర్తిని సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

రాజానగరం: సీతారామపురానికి చెందిన వాకచర్ల విష్ణుమూర్తిని జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఈ ఎన్నిక జరిగిందని విష్ణుమూర్తి గురువారం తెలిపారు. ప్రస్తుతం బీజేపీలో పుష్కర డీసీ మెంబర్‌గా విష్ణుమూర్తి ఉన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులతోపాటు స్థానిక బీజేపీ నాయకులు ఆయనను అభినందించారు.

### ఉత్సాహంగా వేసవి విజ్ఞాన తరగతులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేటశాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరంలో యోగా, హ్యాండ్ క్రాఫ్ట్, పుస్తక పఠనం, లలిత సంగీతం భగవద్గీత పఠనం తరగతులు నిర్వహించారు. విద్యార్థులతో బాలల బొమ్మల రామాయణం పుస్తకం చదివించారు.

# పింఛన్ కోసం ఎదురుచూపులు

- పదకొండు నెలలవుతున్నా మంజూరు కాని కొత్త పింఛన్లు
- నిరాశలో వృద్ధులు, వితంతువులు
- కొత్త దరఖాస్తులకు కలగని మోక్షం
- పింఛన్ల కోసం 2 వేల మందికి పైగా నిరీక్షణ



ఊలపల్లిలో సచివాలయం, పంచాయతీ కార్యాలయం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పింఛన్ అందిస్తున్న వలంటీర్లు (ఫైల్)

బిక్కవోలు: వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం అందజేసే సామాజిక పింఛన్లే ఆధారం. ప్రతి నెలా ఒకటో తేదీ కోసం వీరంతా ఆశగా ఎదురు చూస్తుంటారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచి వారిని ఆదుకుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పింఛన్ నగదు రూ.4 వేలకు పెంచింది. అయితే కొత్తగా ఒక్కరికి కూడా పింఛన్ మంజూరు చేయలేదు. ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు పూర్తయినా కనీసం దరఖాస్తు చేసుకోవడానికి కూడా అవకాశం ఇవ్వలేదు. దీంతో అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. గతేడాది అక్టోబర్ 1వ తేదీ నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. కానీ ఇంత వరకు ఒక్క పింఛన్ కూడా ఇవ్వలేదు. కనీసం దరఖాస్తు చేసుకోవడానికి వైబ్‌సైట్ కూడా తెరవలేదు. భర్తను కోల్పోయి ఎటువంటి ఆసరా లేని వారిని కూటమి ప్రభుత్వం వంచనకు గురిచేస్తోందనే ఆరోపణలున్నాయి. పింఛన్ పెంచడమే కాకుండా అర్హులందరికీ మంజూరు చేస్తామని ఎన్నికల ప్రచారంలో గొప్పలు చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కరికీ కూడా కొత్త పింఛన్ మంజూరు చేయకపోగా, ఉన్న పింఛన్లు ఊడగొడుతున్నారు. కూటమి పెద్దల తీరు అధికారంలోకి రాక ముందు ఒకలా, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకలా ఉందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

#### మళ్లీ అదే తీరు

పింఛన్ల మంజూరు విషయంలో 2014లో అధికారంలో ఉన్నప్పుడు సీఎం చంద్రబాబు నాయుడు ఏ విధంగా వ్యవహరించారో ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనూ మళ్లీ అదే తీరు చూపిస్తున్నారనే చర్చ ప్రజల్లో జరుగుతోంది. నాటి చంద్రబాబు పాలనను ప్రజలు మళ్లీ గుర్తు చేసుకుంటున్నారు.అప్పటిలో గ్రామాల్లో ఎవరైనా పింఛన్ పొందుతున్న వ్యక్తి చనిపోతే తప్ప మరొకరికి కొత్త పింఛన్ మంజూరు చేసేవారు కాదు. వితంతు పింఛన్ మంజూరులో ఇప్పుడు కూడా అలాంటి మెలికే పెట్టారు. ఇది వితంతువుల పాలిట శాపంగా మారింది. వృద్ధాప్య పింఛన్ పొందుతున్న వ్యక్తి చనిపోతే అతని భార్యకు మాత్రమే పింఛన్ మంజూరు చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అంటే అది కొత్తగా పింఛన్ మంజూరు చేసినట్లు కాదు. ఆ కుటుంబంలో పింఛన్‌దారుడు మరణిస్తే దాన్ని అతని భార్యకు బదాలయిస్తున్నారంతే పింఛన్ లేని వ్యక్తి చనిపోతే అతని భార్యకు పింఛన్ మంజూరు చేయడం లేదు.అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో సుమారు 2వేల మందికి పైగా 60 ఏళ్లు నిండిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పింఛన్ కోసం ఎదురుచూస్తున్నారు. 50 ఏళ్లకే పింఛన్ అందిస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ప్రకటించారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గం పరిధిలో మరో 4వేల మంది 50 ఏళ్లు దాటిన వారున్నారు. వారంతా కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారా అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

#### 50 ఏళ్లకే పింఛన్ హామీ గాలికేనా?

సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తామని చెప్పిన హామీని కూటమి నాయకులు గాలికి వదిలేశారని పలువురు ప్రశ్నిస్తున్నారు. బీసీలకు సమన్యాయం చేస్తామని చెప్పిన హామీ ఏమయ్యిందని ఆయా వర్గాల ప్రజలు అడుగుతున్నారు. బూటకపు హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని వారు వాపోతున్నారు.

#### గత ప్రభుత్వంలో ఠంచనుగా పింఛన్

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయంలో లబ్ధిదారులకు ఠంచనుగా పింఛన్లు అందించేవారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా వలంటీర్లు దరఖాస్తు పూర్తి చేసి సచివాలయాల్లో ఇస్తే అర్హులందరికీ పింఛన్లు మంజూరయ్యేవి. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగింది. నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం పింఛన్ల వెబ్‌సైట్‌ను పూర్తిగా నిలిపివేసింది. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ప్రభుత్వం వైబ్‌సైట్ తెరవకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. ప్రభుత్వం నుంచి సమాచారం లేదని సచివాలయం సిబ్బంది చెబుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో పింఛన్ల వివరాలు

| మండలం | పింఛన్‌దారులు |
|---|---|
| అనపర్తి | 10,106 |
| బిక్కవోలు | 10,463 |
| రంగంపేట | 8,711 |
| పెదపూడి | 10,329 |
| మొత్తం | 39,609 |

#### హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం



ఎన్నికల ముందు చెప్పిన హామీలను నెరవేర్చడంతో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విఫలమైంది. ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు పూర్తయినా హామీలను నెరవేర్చలేదు. కొత్త పింఛన్ చాలామంది ఎదురుచూస్తున్నారు. పేదలు పింఛన్ కోసం ఇంకా ఎన్ని రోజులు ఎదురుచూడాలి.

పోతుల ప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచి, ఊలపల్లి గ్రామం

#### ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి



ప్రభుత్వ జీఓను అనుసరించి భర్త పింఛన్ తీసుకుంటూ మరణిస్తే ఆస్థానంలో అతని భార్యకు పింఛన్ వస్తుంది. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు అవకాశం లేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే వారి నుంచి దరఖాస్తులు తీసుకుంటాము.

వి.శ్రీనివాస్, ఎంపీడీవో, బిక్కవోలు

## పునీత జోజప్ప శ్రామికవర్గానికి ఆదర్శం



బూరుగుపూడిలో పునీత జోజప్ప తేరు ప్రదర్శన నిర్వహిస్తున్న ఆర్‌సీఎం క్రైస్తవులు

కోరుకొండ: క్రైస్తవుల ఆరాధ్యదైవం ఏసుక్రీస్తు సాకుడు తండ్రి, పునీత కార్మిక జోజప్ప శ్రామిక వర్గానికి ఆదర్శనీయుడని ఆర్‌సీఎం రెవరెండ్ ఫాదర్ మనోజ్‌కుమార్ అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి ఆర్‌సీఎం చర్చిలో పునీత జోజప్ప శ్రామిక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మేడేని పురస్కరించుకుని నిర్వహించిన ఈకార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా నిర్వహిస్తున్న జోజప్ప దినోత్సవం మానవాళికి మనశ్శాంతిని ఇవ్వాలని ప్రార్థనలు చేశారు. మేడే వేడుకలను ఆర్‌సీఎం క్రైస్తవులు ఘనంగా నిర్వహిస్తారన్నారు. శ్రామికులు అధిక సంఖ్యలో ఉన్న బూరుగుపూడి చర్చికి కార్మిక జోజప్ప దేవాలయంగా నామకరణం చేసినట్టు ఆయన పేర్కొన్నారు. తొలుత బూరుగుపూడిలోని చర్చి నుంచి మెయిన్‌రోడ్డు గుండా రామాలయంవీధి, కాలనీ, అంబేడ్కర్ విగ్రహం వరకూ ప్రదర్శన నిర్వహించారు. పునీత జోజప్పను దర్శించుకునేందుకు క్రైస్తవులు, స్థానికులు తరలివచ్చారు. అనంతరం చర్చిలో పాదర్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ క్రైస్తవులు బైబిల్ పఠనం చేయాలని, సహోదర ప్రేమను విస్తృతం చేయాలన్నారు. ప్రపంచంలో యుద్ధాలు సమసిపోయి శాంతి వర్ధిల్లాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన ఆర్‌సీఎం క్రైస్తవులు నన్స్, ఉపదేసులు కొల్లి జాకబ్ రాజు, రాయి థోమాస్ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

## దోమాడ బాధితులకు బియ్యం పంపిణీ



దోమాడలో బాధితులకు బియ్యం పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: దోమాడలో నిరుపేదల ఇళ్లు కూల్చివేసి 9 రోజులు గడుస్తున్నా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అధికార పార్టీకి చెందిన నాయకులు వచ్చి బాధితులను పరామర్శించలేదని వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఎద్దేవా చేశారు. దోమాడ గ్రామంలో గృహాలు కోల్పోయిన బాధితులను మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి గురువారం పరామర్శించారు. ఒక్కో బాధిత కుటుంబానికి 25 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి బాధితుల పరామర్శకు రాకుండా ఇతర ప్రాంతాల్లో పర్యటిస్తున్నారని దుయ్యబట్టారు.

#### పేదల ఇళ్ల కూల్చివేత దారుణం

ప్రతి పేదవాడికీ ఇంటి స్థలం ఇవ్వాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలంచారన్నారు. ఆ ప్రకారం దోమాడలో 160 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. ఇంకా 40 మంది అర్హులున్నారన్నారు. ఎన్నికలు రావడంతో మిగిలిన వారికి పట్టాలు ఇవ్వలేకపోయామన్నారు. స్థానిక పేద ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రైవేటు లేఅవుట్‌కు అనుమతులు ఇవ్వాలని సూర్యనారాయణరెడ్డి అన్నారు. దౌర్జన్యంగా, తెల్లవారుజామున పేదల ఇళ్లు కూల్చి వేయడం దారుణమని ఆయన విమర్శించారు. మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు మాట్లాడుతూ బాధితులకు న్యాయం కోసం ఈనెల 5న జరిగే చలో దోమాడ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాలు ప్రజలు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గుబ్బల ఆదినారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జైభీమ్ భారత పార్టీ ప్రతినిధి ఎనుగుపల్లి కృష్ణ మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరిగే వరకు ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో దోమాడ సర్పంచ్ మీనవల్లి శారదదేవి, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, పార్టీ నాయకులు డొకుబుర్ర కృష్ణ, డి.అప్పారావు, పంపన రమణ, నియోజకవర్గం ఎస్సీ సెల్ కన్వీనర్ సాంబత్తుల చంటి పాల్గొన్నారు.

### నూతన లేబర్ కోడ్లను రద్దు చేయాలి

కోరుకొండ: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కుదించి తెచ్చిన 4 లేబర్ కోడ్ల రద్దు కోసం కార్మికులు ఐక్యంగా పోరాడుదామని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు వెంకటనాయుడు పిలుపునిచ్చారు. గురువారం కోరుకొండ రాఘవనగర్‌లో మేడే సందర్భంగా ప్రదర్శన, జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎంతోకాలంగా పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం మార్చిందని అన్నారు. వ్యవసాయ నల్లచట్టాలను రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట దక్షిణ భారతదేశంలో జరుపుతున్న హత్యాకాండను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎర్ర జెండాను ఆయన ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు జగన్నాథం నాగన్న, దాసరి వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.

### ఉత్సాహంగా వేసవి విజ్ఞాన తరగతులు

సీతానగరం: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. గురువారం విద్యార్థులు పుస్తక పఠనం, సమీక్ష కార్యక్రమాల్లో పాల్గొన్నారని లైబ్రేరియన్ టి.అరుణ్ కుమార్ తెలిపారు. రిటైర్డ్ సహాయ సంక్షేమ అధికారి ఓఎన్ సురేష్‌బాబు ఇంగ్లీష్, తెలుగు, హిందీ స్పీకింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు నీతి కథలు చెప్పడం, పుస్తక సమీక్ష, పఠనం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

## కేంద్ర ప్రభుత్వ కుల గణన నిర్ణయంపై హర్షం



సమావేశంలో పాల్గొన్న ఆస్క్ సభ్యులు

సీటీఆర్ఐ: 2021 జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని అంబేడ్కర్ సేవా కేంద్రం (ఆస్క్) వ్యవస్థాపక అధ్యక్షుడు గుబ్బల రాంబాబు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్క్ ఆధ్వర్యంలో ఐదేళ్లుగా అంబేడ్కర్ భావజాల వ్యాప్తి, అందరికీ చదువు, అభివృద్ధి, దేశం కోసం పనిచేయడం వంటి అంశాలపై విస్తృతంగా కార్యక్రమాలను చేపడుతున్నట్టు తెలిపారు. దేశంలో 6,154 కులాలకు ఇంకా రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికపరంగా ప్రాతినిధ్యం దక్కలేదని ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా దామాషా ప్రకారం అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలన్న అంబేడ్కర్ ఆశయం నెరవేరడానికి చాలాకాలంగా పోరాటాలు, సామాజిక ఉద్యమాలు జరుగుతున్నాయని తెలిపారు. అంబేడ్కర్ జయంత్యుత్సవాల్లో భాగంగా ఈనెల 4వ తేదీ ఆదివారం స్థానిక మోడల్ కాలనీలో ఉన్న ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ భవనంలో ఉభయగోదావరి జిల్లాల కవులు, గాయకుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమ్మేళనం అనంతరం కవులను, గాయకులను సత్కరించి జ్ఞాపిక అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పూలే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు నయనాల కృష్ణారావు, ఆస్క్ ఉపాధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు పాల్గొన్నారు.

#### కులగణన పారదర్శకంగా నిర్వహించాలి

రాజమహేంద్రవరం సిటీ: కేంద్రం చేపట్టాలనుకుంటున్న కులగణన పారదర్శకంగా నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ కులగణన నిర్ణయాన్ని ఆమె స్వాగతించారు.ఈ జనగణన ద్వారా దేశంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలను గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. దాని ఆధారంగా సంక్షేమ పథకాలను అవసరమైన వారికి అందించగలమని అభిప్రాయపడారు.

### కార్మికులకు రక్షణగా చట్టాలు

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్మిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక విక్రం హాలులో గురువారం అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జ్ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ బి.పద్మ కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలిపారు. కార్మికులు వారి హక్కులు, సంక్షేమానికి రూపొందించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్మికులకు రక్షణగా ప్రత్యేక చట్టాలున్నాయని వివరించారు.

## కూలీలు, ట్రాక్టర్ల యజమానుల మధ్య ఘర్షణ



ముగ్గళ్ల ర్యాంపులో వాగ్వివాదానికి దిగిన ఇసుక ఎగుమతి కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు

సీతానగరం: అనధికార ముగ్గళ్ల ఇసుక ర్యాంపులో ట్రాక్టర్ల యజమానులు, కూలీల మధ్య గురువారం వివాదం రాజుకుంది. దీనితో రంగప్రవేశం చేసిన రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ర్యాంపును మూసివేశారు. వివరాల్లోకి వెళ్లితే ప్రభుత్వం అధికారికంగా వంగలపూడి ర్యాంపు నుంచి ఉచిత ఇసుకను తీసుకువెళ్ల వచ్చని ప్రకటించింది. ప్రజాప్రతినిధుల అండదండలతో అనధికార రేవులైన సింగవరం, ముగ్గళ్ల రేవుల నుంచి ట్రాక్టర్లపై ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారం వంగలపూడి రేవు నుంచి ఉచిత ఇసుక తీసుకుని వెళ్లవచ్చు. అయితే ట్రాక్టర్లపై గోకవరం, కోరుకొండ, రంగంపేట తదితరు దూర ప్రాంతాలకు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ముగ్గళ్ల ర్యాంపులోకి కేవలం అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్లు మాత్రమే వెళ్లి ఇసుక తరలిస్తుంటాయి. ఇతర గ్రామాల ట్రాక్టర్లను ఈ ర్యాంపులోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారు. గురువారం కూలీలు ఇతర ప్రాంత ట్రాక్టర్లను రానివ్వాలని, రోజువారీ కూలి పెరుగుతుందని వారన్నారు. కేవలం ముగ్గళ్ల ట్రాక్టర్లకు ఇసుక ఎగుమతి ద్వారా రోజువారీ వచ్చే కూలీ నగదు సరిపోవడం లేదంటూ ఇసుక ఎగుమతులను నిలిపివేశారు. దీనితో ముగ్గళ్ల ట్రాక్టర్ల యజామానులు, డ్రైవర్లు కలసి కూలీలతో వాగ్వివాదానికి దిగారు. దీంతో కూలీలు ఇసుక ఎగుమతి చేసేది లేదంటూ భీష్మించారు. సమాచారం అందుకున్న రెవెన్యూ వీఆర్వో చిన్నా, స్థానిక పోలీస్ సిబ్బంది ర్యాంపు వద్దకు చేరుకుని ఇసుక తవ్వకాలను నిలిపివేశారు.

### భవన నిర్మాణ పనుల పరిశీలన



భవన నిర్మాణ పనులను పరిశీలించి, సిబ్బందికి సూచనలిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో రూ.28.30 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రెండు భవనాలను వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ గురువారం పరిశీలించి, సిబ్బందికి సూచనలిచ్చారు. పరీక్షల నిర్వహణ, కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కోసం ఈ రెండు భవనాలను నిర్మిస్తున్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేయడంతోపాటు నాణ్యతకు ప్రాధాన్యతనివ్వాలని వీసీ సూచించారు.

## ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం




సీతానగరంలో మేడే సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు



సూర్యారావుపేటలో మే డే జెండాను ఎగురవేస్తున్న ఉపాధి కూలీలు

సీతానగరం: పలు గ్రామాల్లో మేడే దినోత్సవాన్ని కార్మిక సంఘాలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు ఆధ్వర్యంలో సీతానగరం బస్టాండ్ సెంటర్, పార్టీ కార్యాలయం, చీపురుపల్లిలో జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి వీరబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కురుకూరి కృపమ్మ, సీపీఐ ఎంఎల్ పార్టీ నాయకుల పలివెల జ్యోతి, నందమూరి చిట్టిస్వామి తదితరులు పాల్గొన్నారు. మే డే సందర్భంగా సీతానగరంలో మండల ఆశా వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. మండల ఆశావర్కర్లు యూనియన్ అధ్యక్షురాలు ఎమ్ కుమారి ఆధ్వర్యం వహించారు. కార్యక్రమంలో పలువురు ఆశావర్కర్లు పాల్గొన్నారు

#### రాజానగరంలో ర్యాలీ

రాజానగరం: నియోజకవర్గంలో గురువారం మే డే వేడుకలు సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ, కార్మిక సంఘాల సమాఖ్యల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాజానగరం, సూర్యారావుపేటలో, సాయిబాబా గుడి సెంటరులో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జనిపెల్ల సత్తిబాబు, సూర్యరావుపేటలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ కార్యదర్శి దుర్గాప్రసాద్ ఎర్ర జెండాలను ఎగురువేసి ర్యాలీ నిర్వహించారురు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు ఏవీ రమణ, రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు. సూర్యారావుపేటలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలు, రాజానగరం, దివాన్‌చెరువులలో ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో మే వేడుకలు నిర్వహించారు.

#### ఘనంగా మేడే వేడుకలు

పెదపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మేడే సందర్భంగా సీఐటీయూ మండల నాయకురాలు ఎం.రాజుశ్వరి అధ్యక్షతన సీఐటీయూ నాయకురాలు ఎం.సుబ్బలక్ష్మి తదితరులు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సత్తిరాజు ఆధ్వర్యంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకకర్తలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ వర్కర్స్ యూనియన్, ఐఎఫ్‌టీయూ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. అనంతరం ఎర్ర జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మేడపాటి గోపాలకృష్ణ, ఎర్రశెట్టి రావులమ్మ, సాంబమూర్తి పాల్గొన్నారు. పెదపూడి గ్రామశివారు కైకవోలు సెంటర్‌లో ఏపీఆర్‌సీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజుబాబు, సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

### అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు

బోట్‌క్లబ్: మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని అనపర్తి ఎమ్మెల్యే నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పెదపూడి మండలం దోమాడలో ఒక లేఅవుట్ విషయంలో కూటమి నాయకులు ఐదు కుటుంబాలను ఖాళీ చేయించి ఇబ్బందులు పెడుతున్నారని తప్పుగా ప్రచారం చేస్తున్నారన్నారు.

ఈ విషయంలో తమకు ఎవరికీ సంబంధం లేదన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలోనే లే– అవుట్‌కు సంబంధించిన అన్ని అనుమతులు తీసుకున్నారన్నారు. ఆర్అండ్‌బీ భూమిని ఆక్రమించుకుని నివశిస్తున్న ఐదు కుటుంబాలను ఖాళీ చేయించాలని లే– అవుట్ యజమానులు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకొంటే అధికారులు ఖాళీ చేయించారన్నారు. ఈ ఐదు కుటుంబాలకు వైఎస్సార్ సీపీ హయాంలో ఇళ్ల పట్టాలు సైతం మంజూరు చేశారని అన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు, అనపర్తికి చెందిన కూటమి నేతలు పాల్గొన్నారు.